



# రాంగ్ నెంబర్

దోనేపూడి ప్రేమదులారి

"హలో... సీతారామయ్యగారా?"

"అవునండీ..."

"నేను రంగారావుని గుంటూరు నుంచి వచ్చాను... అమీర్‌పేటలో మా బావమరిది ఉంటే వాళ్ళింట్లో దిగాను. ఏ ఆదివారమైనా పిల్ల ఇంట్లో ఉంటుంది. చూడవచ్చని రాసారు కదా... అందుకనే వచ్చాము. రేపు పొద్దున పదిన్నరకల్లా మీ ఇంటికి వస్తాం, పిల్లని చూడడానికి..."

"మంచిదండీ..."

"ఉంటానయితే... స్తూ రేపు కలుద్దాం..." అన్నాను ఫోన్ పెట్టేస్తూ రంగారావు.

★ ★ ★

ఆదివారం ఉదయం —

మిగతా రోజుల్లాగానే ఆ రోజు సీతారామయ్యగారింట్లో హడావుడిగా ఉంది.

పెళ్ళి వారొస్తున్నారని కాదు —

ఏదో ఫంక్షన్‌కి వెళ్లాలని సీతారామయ్య హడావిడి పడుతుంటే, ఏదో ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌కి వెళ్లాలని ఆయన కుమార్తె మాధవి టెన్షన్ పడుతోంది. వీళ్ళిద్దరికీ భోజనాలు పెట్టి పంపించడానికి సీతారామయ్యగారి భార్య సీతమ్మ కంగారు పడుతోంది...

"సరిగా పది గంటలకల్లా ఫంక్షన్ ప్రారంభమవుతుంది తొమ్మిదిన్నరకల్లా వెళ్ళాలని చెప్పాను కదా..."

"ప్రతీరోజూ ఈ హడావిడి తప్పదు. ఆదివారం కదాని కొద్దిగా బద్ధకించాను... మీకు ఆదివారమైనా శలవుంటుంది. నాకే రోజూ శలవుండదు..." విసుక్కుంటూనే వడ్డించసాగింది సీతమ్మ.

తండ్రీ కూతుళ్ళిద్దరూ భోజనానికి కూర్చున్నారు.

"ఆదివారంనాడు ఇలాంటి పనులు పెట్టుకోకుండా ఇంట్లో నాకు కాస్తా సాయంగా ఉండవచ్చుగా...?"

"అమ్మాయితో అనాల్సిన మాట నాతో అంటున్నావ్..."

"నాకివాళ పరీక్షుంది నాన్నా..."

"నాకే ఏమీ లేదు —మీకు సేవ చేయడం తప్ప..."

భోజనాలు పూర్తయ్యీ కాకముందే బయటకు దూసుకుపోయాడు. సీతారామయ్య ఆలస్యమైపోయిందంటూ.

"నేనూ వస్తానమ్మా..." వెనకే బయల్దేరింది మాధవి.


వాళ్ళిద్దర్నీ చూస్తూ ఏదో ఆలోచిస్తూ గుమ్మంలోనే నిలబడ్డ సీతమ్మ ఇంటి ముందు ఆటో ఆగిన శబ్దంతో ఈ లోకంలోకి వచ్చింది.

ఆటోలోంచి దంపతులతో పాటు, ఓ యువకుడు దిగాడు.

అయోమయంగా చూస్తున్న సీతమ్మని అర్థం కానట్లు చూస్తూ "నా పేరు రంగారావు మాది గుంటూరు. అమ్మాయిని చూట్టానికి ఏ ఆదివారమైనా రావచ్చని ఉత్తరం రాసారు కదా... ముగ్గురం రాత్రి వచ్చాం..." మెట్లెక్కుతూ ఉపోద్ఘాతాన్ని ప్రారంభించాడు రంగారావు.

రండన్నట్లు వాళ్ళనాహ్వానిస్తూ, లోపలికి రెండడుగులు వేసింది సీతమ్మ.

ఆమెకి అయోమయంగా ఉంది.



ఏ నేరం చేసి జైలుకు వచ్చావు అని అడిగాడు ఒక ఖైదీ మరో ఖైదీని ప్రభుత్వం చేసే మంచిపనులు నేనూ చేశాను. చెప్పాడు ఖైదీ అంటే? ప్రభుత్వం నోట్లు అచ్చువేస్తుంది కదా? నేను అచ్చువేశాను.... కానీ అది నేరమంటూ లోక్కొచ్చారని చెప్పాడు విసుగ్గా.

వీళ్ళిలా వచ్చారు! ఆయన గాని, పిల్లగాని లేరు... ఎలా?

కంగారు పడుతూనే వాళ్ళని కూర్చోమంది. విషయాన్ని ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కావడం లేదు...

"మీరు ఫోన్ చేసి ఉండాల్సింది బయల్దేరబోయేముందు..." నసిగింది.

"పదిన్నరకి వస్తున్నట్లు ఫోన్ చేసాను కదా..." అయోమయంగా చూడటం రంగారావు వంతైంది.

"ఫోన్ చేశారా...? సీతమ్మ" ఆశ్చర్యపోతూ అడిగింది.

"మీ ఫోన్ నెంబరు 667347 కదా?"

"అవును!"

"మీ వారి పేరు సీతారామయ్యే కదా?"

"మరి ఈ నెంబరుకే ఫోన్ చేసి, సీతారామయ్యగారితో మాట్లాడాను."

"అయ్యో! ఆయన చెప్పడం మరచిపోయినట్లున్నారండి..."

"సీతారామయ్యగారు కాదా?" రంగారావుకి కోపం వచ్చినట్లు ముఖంలోనే ప్రతిబింబిస్తోంది.

"ఏదో ఫంక్షనుందని వెళ్ళారండి."

"మమ్మల్ని పిల్లని చూట్టానికి రమ్మని ఫంక్షన్ కెళ్ళారా?" రంగారావు కోపం కంఠలో కూడా ప్రతిధ్వనిస్తోంది. అంతలోనే తమాయించుకుని "ఆయన లేకపోతే సరేలెండి... పిల్ల ఉంది కదా చూసి వెళ్తాం..."

"అమ్మాయీ లేదండి..." బిక్క చచ్చిపోతూ జవాబిచ్చింది సీతమ్మ.

"అమ్మాయి లేదా?" రంగారావు భార్యకి కోపం వచ్చింది.

"మీరొస్తున్నారని తెలిస్తే పరీక్ష అయినా వెళ్లనిచ్చేవాళ్లంకాదు..."

"చాల్చాల్లే తల్లీ... వస్తున్నామని ఉత్తరం రాశాం. అది అందిందో లేదోనని ఫోనూ చేశాం..."

"ఉత్తరం అందలేదండి..."

"ఫోన్ చేశాను కదా... అదీ అందలేదని చెప్పడానికి లేదుగా... మాట్లాడింది మీ వారే!"

"మరచిపోయుంటారండి... నాతో చెప్పనుకూడా చెప్పలేదు..."

"అయితే మా సంబంధం గురించి కూడా మరిచిపోండి..." కోపంగా వాళ్లు వెళ్లిపోతుంటే నిరుత్తరాలై అలాగే నిలుచుండిపోయింది సీతమ్మ.

ఆ అవమానం తాలూకు కోపం ఆమెని ఒక్క క్షణం విశ్రాంతి తీసుకోనివ్వలేదు. అలా కాలు గాలిన పిల్లిలా ఇంట్లో అటు ఇటూ తిరుగుతూనే ఉంది. భర్త రాగానే రెట్టింపు కోపంతో విరుచుకుపడింది.

"గుంటూరు సంబంధం వాళ్లు ఫోన్ చేస్తే ఎందుకు చెప్పలేదు?" భార్యనంత కోపంగా అంతకుముందెప్పుడూ చూడని సీతారామయ్య కంగారు పడిపోయాడు.

"వాళ్లు నాకెక్కడ ఫోన్ చేశారు?"

"అంత అమాయకత్వం నటించకండి. మీతో ఫోన్‌లో మాట్లాడానని ఆయన ఎంత గట్టిగా చెప్పాడు! నానామాటలని వెళ్లిపోయాడు..."

"అయ్యో! నిజంగా చెపుతున్నానే ఆయనతో ఫోన్లో నేను మాట్లాడలేదు. వాళ్లు ఈ ఊళ్లో ఎక్కడ దిగారట?"

"ఆ వివరాలడిగే అవకాశమెక్కడుంది? మీరిద్దరూ లేరనేసరికి వాళ్లు కోపంతో ఊగిపోయారు. నాకు నోట మాట రాలేదు. వాళ్లు వెళ్లిపోతున్నా మాటరాక అలాగే చూస్తుండిపోయాను..."

"అయ్యో! ఇప్పుడెలా?"

ఇంతలో ఫోన్ మ్రోగింది.

చటుక్కున ఫోనందుకున్నాడు సీతారామయ్య.

"667347 ఏనాండీ?"

"అవునండి."

"సీతారామయ్యగారేనా మాట్లాడేది?"

"అవునండి!"

"మేము వస్తున్నామని చెప్పినా ఎక్కడికో వెళ్లిపోయారు. ఏం మనుషులండి మీరు..."

"నేను మీతో మాట్లాడానా ఫోన్లో?"

"ఎందుకంటి ఇంకా అబద్ధాలు... గుంటూరు నుంచి వచ్చాం... మాతో మీకు పరాచికాలేమిటండి?"

"పరాచికాలు కాదండి..."

"ఇంక మాట్లాడకండి..."

ఠక్కున ఫోన్ పెట్టేసిన శబ్దం.

నిర్ఘాంతపోయి అలాగే ఫోన్‌వంక చూస్తూ నిలుచుండిపోయాడు సీతారామయ్య.

ఆ ఫోన్ లీలతోనే తనకా అవస్థ కలిగిందని అతను ఊహించలేదు. తనకి రంగారావు చేసిన ఫోన్ రాంగ్ నంబర్‌కి కలిసిందని, ఆ రాంగ్ నెంబర్‌లోని మనిషిలో సెన్సాఫ్ హ్యూమర్ ఎక్కువై అతనే సీతారామయ్యలా మాట్లాడి ఫోన్ పెట్టేసాడనే విషయం సీతారామయ్యకే కాదు, మన ఊహలకే అందదు.

ఏది ఏమైనా సీతారామయ్య కుమార్తెకి బంగారంలాంటి సంబంధం కాన్సిలవడానికి కారణం ఆ ఫోననే మాట మాత్రం యథార్థం. కాగా పోస్టల్ వాళ్ల పుణ్యమా అని ఉత్తరం ఈ ప్రహసనం అంతా అయిన తర్వాత తీరుబడిగా సీతారామయ్యగారింటికి చేరింది. ★

పది ఎలకల బోను కావాలి అన్నాడు సుబ్బయ్య దుకాణదారునితో
వాటిని మీతో తీసుకెళ్తారా అన్నాడు దుకాణదారుడు
లేదు... వాటినే మీ దుకాణానికి పంపిస్తా అన్నాడు సుబ్బయ్య దుకాణదారునితో...

